



# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 3 | సంచిక : 258 | మే 16 శనివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# అటవీ శాఖలో అక్రమాలు!




## అటవీశాఖలోని కొందరు అధికారులు అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి

- కార్యాలయానికి సంబంధించిన నిధులు సొంతానికి వినియోగం
- అక్రమ కలప స్మగ్లర్లతో, వ్యాపారులతో సత్సంబంధాలు
- పైస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల పేరిట అక్రమ వసూళ్లు
- కలప వ్యాపారుల నుంచే కాకుండా కిందిస్థాయి సిబ్బంది నుంచి డబ్బుల డిమాండ్
- సదరు అధికారులపై గతంలో ఏసీబీ నిఘా







**మన దునియా,నిజామాబాద్ జిల్లా:మే15**

అటవీశాఖలోని కొందరు అధికారులు అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సొంత శాఖలోనే తోటి ఉద్యోగులనే కాకుండా కిందిస్థాయి సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్న విషయం తెలిసిందే. సదరు అధికారులు ఏకంగా ఆ శాఖలోని ఉన్నతస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి కలప వ్యాపారుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడేవారని విమర్శలు వస్తున్నాయి. ఈ అధికారుల ప్రమేయంతోనే స్మగ్లర్లు, పలువురు కలప వ్యాపారులు జిల్లా నుంచి అక్రమంగా కలపను తరలించేవారని పలువురు కలప వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా సదరు అధికారులు కార్యాలయ నిర్వహణకు ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసే నిధుల్లో కూడా అక్రమాలకు పాల్పడుతుండేవారని కొందరు సిబ్బంది గతంలో ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. సదరు అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై గతంలో ఏసీబీ అధికారులు సైతం నిఘా పెట్టగా ఏసీబీకి చిక్కకుండా తప్పించుకున్నట్లు సమాచారం.

**రెండు డివిజన్లు.. 8 రేంజ్‌లు..**

జిల్లాలో అటవీశాఖకు సంబంధించి కామారెడ్డి, బాన్సువాడ రెండు డివిజన్ల పరిధిలో మొత్తం 8 అటవీశాఖ రేంజ్‌లు ఉన్నాయి. కామారెడ్డి డివిజన్ పరిధిలో కామారెడ్డి, మాచారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, అటవీశాఖ రేంజ్‌లు రాగా బాన్సువాడ డివిజన్‌లో గాంధారి, జుక్కల్, పిట్లం, బాన్సువాడ రేంజ్‌లు ఉన్నాయి. అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను రేంజ్‌లుగా ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మాచారెడ్డి రేంజ్ పరిధిలో అన్నారం చెక్‌పోస్టును, ఎల్లారెడ్డి, బాన్సువాడ రేంజ్ పరిధిలో బొగ్గు గుడిసె చెక్‌పోస్టును, బాన్సువాడ, గాంధారి రేంజ్ పరిధిలో ముదెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద చెక్‌పోస్టును, పిట్లం రేంజ్ పరిధిలోని బిచ్కుంద మండలంలోని కందెరపల్లి గ్రామం

(మిగతా 2వ పేజీలో..)

## సీఎం విజయ్ మరో బిగ్ డెసిషన్.. 18 కాదు ఇక 21 ఏళ్లు.. ఐడీ కార్డ్ చూపిస్తేనే మద్యం !

**మన దునియా,తమిళనాడు:మే 15**

తమిళనాడు సర్కార్ మద్యం అమ్మకాలపై చకచకా నిర్ణయాలు తీసుకుంటుంది. నిన్నటికి నిన్న గుళ్లు, గోపురాలు, స్కూల్స్, బస్టాండ్ల దగ్గరలో ఉన్న 717 లిక్కర్ షాపులను మూసివేస్తూ సీఎం విజయ్ నిర్ణయం తీసుకున్నారు.ఇప్పుడు లిక్కర్ పాలసీకి సంబంధించి మరో సంచలన నిర్ణయం తీసుకున్నారాయన. మద్యం అమ్మకాలకు సంబంధించి ఇప్పటి వరకు 18 ఏళ్ల వయస్సు ఏజ్ లిమిట్?గా ఉంది. ఇక నుంచి ఆ వయస్సును 21 ఏళ్లకు పెంచుతూ సీఎం విజయ్ ఆదేశాలు జారీ చేశారు.18 ఏళ్లలోపు వాళ్లకు వైన్ షాపుల్లో లిక్కర్ అమ్మబడదు.. 18 ఏళ్లలోపు వాళ్లకు బార్లు, పబ్స్ లో ఎంట్రీ లేదు అనే బోర్డులు ఉండేవి. ఇక నుంచి 21 ఏళ్ల వయస్సులోపు వాళ్లకు వైన్ షాపుల్లో మద్యం అమ్మరు.. బార్లు, పబ్స్ లో నో ఎంట్రీ

(మిగతా 2వ పేజీలో..)




## సనాతన ధర్మంపై వ్యాఖ్యలు.. ఉదయనిధి స్టాలిన్ వివరణ

- సనాతన ధర్మంపై అసెంబ్లీలో వ్యాఖ్య
- తన మాటలను వక్రీకరిస్తున్నారన్న ఉదయనిధి స్టాలిన్
- సనాతన ధర్మాన్ని కించపరచడం తన ఉద్దేశం కాదని స్పష్టీకరణ
- సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలని కోరుకుంటున్నానని వెల్లడి

సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల డీఎంకే యువ నేత ఉదయనిధి స్టాలిన్ వివరణ ఇచ్చారు. ఇటీవల అసెంబ్లీలో సనాతన ధర్మంపై ఆయన

2



## నీట్ విద్యార్థులది వ్యవస్థ చేసిన హత్య.. మోదీ ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం

**మన దునియా,న్యూఢిల్లీ:మే15**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు.

విద్యార్థులు ఓడిపోలేదు..

లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా

(మిగతా 2వ పేజీలో..)




## కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

**మన దునియా,హైదరాబాద్:మే 15**

గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దగ్గర తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. ఈరోజు (శుక్రవారం) హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.

**జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారు..**

పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## సీఎం విజయ్ మరో బిగ్ డెసిషన్.. 18 కాదు ఇక 21 ఏళ్లు.. ఐడీ కార్డ్ చూపిస్తేనే మద్యం !

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ నిర్ణయం తీసుకున్నారు సీఎం విజయ్. వయస్సు ధృవీకరణ కోసం కొత్త రూల్స్ తీసుకొచ్చింది తమిళనాడు సర్కార్. ఆధార్ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఓటర్ ఐడీ కార్డు చూపించాల్సి ఉంటుంది. 21 ఏళ్ల వయస్సు నిండిన వాళ్లకే మద్యం అమ్ముతారు. వైన్ షాపుల దగ్గర వయస్సుకు సంబంధించి అమ్మకం దారులకు అనుమానం వస్తే.. మద్యం కొనుగోలుదారులు తమ వయస్సు ధృవీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుంది.వైన్ షాపులు, బార్లు, పబ్స్ దగ్గర కొత్తగా 21 ఏళ్ల వయస్సులోపు వాళ్లకు మద్యం అమ్మకాలు ఉండవు అనే బోర్డులు కచ్చితంగా ప్రదర్శించాలని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశారు. తమిళనాడు రాష్ట్రంలో మద్యం అమ్మకాలు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే సాగుతాయి. బార్లు, పబ్స్ ప్రైవేట్ వ్యాపారులు నిర్వహిస్తుంటారు.

## కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని.. కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్టం చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని కూడా ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ పేరును ఒప్పిస్తామని తెలిపారు.

దేశానికి కూడా సేవలందిస్తా..

ఇండియా కూటమి తరపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఇక్కడి ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు..

## నీట్ విద్యార్థులది వ్యవస్థ చేసిన హత్య.. మోదీ ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం

(మొదటి పేజీ తరువాయి)

'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గోవాలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారు' అని ఆందోళన వ్యక్తం చేశారు.

148 పరీక్షల కుంభకోణాలు..

2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ, ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని అన్నారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు.

ఎవరినీ వదిలిపెట్టం..

'మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు' అంటూ మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి, 'మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలి?' అని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం' అంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు..




# సనాతన ధర్మంపై వ్యాఖ్యలు.. ఉదయనిధి స్టాలిన్ వివరణ

చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీతో పాటు వివిధ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఉదయనిధి స్టాలిన్ వివరణ ఇచ్చారు.తన మాటలను వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. ప్రజలను అగ్ర, నిమ్న వర్గాలుగా విభజించే కుల వ్యవస్థను నిర్మూలించాలనే ఆలోచనను తాను వ్యక్తం చేశానని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన హక్కులు ఉండాలని తాను కోరుకుంటున్నానని ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. పెరియార్, అంబేద్కర్ చెప్పిన సూత్రాల గురించి తాను అసెంబ్లీలో మాట్లాడినట్లు ఉదయనిధి పేర్కొన్నారు. తనపై ఎంతమంది ఎన్ని విమర్శలు చేసినా భయపడేది లేదని స్పష్టం చేశారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటానని అన్నారు. కానీ సనాతన ధర్మానికి తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో అసమానతలు, అణచివేతను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు.

# అటవీశాఖలో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

వద్ద చెక్‌పోస్టును, జిల్లా సరిహద్దు అయిన మద్నూర్ వద్ద మరో చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుల వద్ద అటవీశాఖ అధికారులతో పాటు పోలీసు శాఖ సిబ్బంది సైతం తనిఖీలు చేస్తారు.

**నిధుల దుర్వినియోగం**

జిల్లా అటవీశాఖలోని ఓ డివిజన్, రేంజ్ స్థాయి అధికారులు తమ తమ కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం కేటాయించే నిధుల్లో కూడా దుర్వినియోగానికి పాల్పడుతుండేవారని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలోని అటవీశాఖ జిల్లా కార్యాలయంతో పాటు డివిజన్ రేంజ్ స్థాయి కార్యాలయాల నిర్వహణకు రూ.లక్షలాది నిధులను కేటాయిస్తోంది. కార్యాలయాల్లో ఫర్నిచర్, స్టేషనరీ ఇతరత్రా సామగ్రి కోసం నిధులు వస్తుంటాయి. అయితే ఈ నిధుల వినియోగంలో సదరు అధికారులు సొంతానికి వాడుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి సంబంధించిన నిధులను ఓ డివిజన్ స్థాయి అధికారి కిందిస్థాయి సిబ్బంది భార్యల అకౌంట్‌లో వేసుకోవాలని చెప్పడం ఏమిటని ఆ శాఖ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల కిందట పై స్థాయి అధికారుల వేధింపులతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సిబ్బంది ఇదే విషయాన్ని సదరు అధికారిపై ఆరోపించాడు. తాను ఆ నిధులను అకౌంట్‌లో వేసుకోకపోవడంతో భిక్కనూర్ మండలంలోని జంగంపల్లికి చెందిన ఓ ఫారెస్ట్ సిబ్బంది భార్య అకౌంట్‌లో జమచేసినట్లు ఆ సిబ్బంది ఆరోపించాడు. ఇలా డివిజన్ స్థాయి అధికారే కాకుండా రేంజ్ పరిధిలో ఉండే కొందరు అధికారులు సైతం నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

**కలప స్మగ్లర్లతో సత్సంబంధాలు**

జిల్లాలోని అటవీ ప్రాంతంలో విచ్చలవిడిగా చెట్లను నరికి యథేచ్ఛగా స్మగ్లర్లు అక్రమంగా కలపను రవాణా చేస్తూ రూ.కోట్లలో కలప దందా కొనసాగిస్తూ వచ్చారు. కలప స్మగ్లర్లకు, వ్యాపారులకు అటవీశాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది సహకారంతోనే కలప అక్రమ రవాణా జరుగుతుందని ఆరోపణలు వచ్చాయి. అదే విధంగా అటవీశాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది పనితీరు వివాదాస్పదంగా మారుతోంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి రేంజ్‌ల పరిధిలో అటవీ చాలా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో స్మగ్లర్లు గుట్టు చప్పుడు కాకుండా విలువైన అటవీ సంపదను దోచుకెళ్తుంటారు. ప్రధానంగా మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట, సదాశివనగర్, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి, తదితర మండలాల్లోని అటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా కలపను తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తనిఖీలు చేయకుండా 'మామూలు'గానే తీసుకుంటున్నట్లు సమాచారం. కలప స్మగ్లర్లు సంబంధిత అధికారులకు ఇచ్చే మామూళ్లకు లొంగిపోయి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**అక్రమ వసూళ్లు**

అటవీశాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు డివిజన్, రేంజ్ స్థాయి అధికారుల అక్రమ వసూళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని సొంతశాఖ సిబ్బందే చెప్పుకు రావడం గమనార్హం. ఆ అధికారులు పనిచేసే కార్యాలయాల పరిధిలోని కిందిస్థాయి సిబ్బంది నుంచే డబ్బులు వసూలు చేయడం వివాదాస్పదంగా మారుతోంది. కొందరు సిబ్బంది వీరి వేధింపులు తాళలేక ఆకాశరామన్నల పేరిట ఉత్తరాలు రాయడం వీరి అక్రమ వసూళ్లకు నిదర్శనం. అటవీశాఖలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు, ట్రాక్టర్, లారీ, జేసీబీ తదితర ఇసుక, రవాణా వాహనాల యజమానుల వద్ద, కిందిస్థాయి ఉద్యోగులైన అటెండర్ నుంచి జూనియర్ స్థాయి అధికారుల వరకు, కార్యాలయ సిబ్బంది దగ్గర పై స్థాయి అధికారుల ఖర్చుల నిమిత్తం డబ్బులు డిమాండ్ చేసేవారని కొందరు సిబ్బంది ఫిర్యాదు చేశారు. అలాగే ప్రజాప్రతినిధులను సైతం వదల లేదు. వారి పేర్లు చెప్పి సదరు అధికారులు కలప వ్యాపారులు, సామిల్‌ల యజమానుల నుంచి రూ.లక్షలు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి సదరు అధికారులు అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు మరింత రెచ్చిపోతున్నారే వాదన సొంతశాఖ సిబ్బంది నుంచేవినిపిస్తోంది.

# పోక్సో కేసు: బండి భగీరథ్‌కు హైకోర్టులో చుక్కెదురు

**ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరణ**

**అరెస్టు నుంచి రక్షణపై వచ్చే వారం నిర్ణయం వెలువరిస్తామన్న న్యాయస్థానం**

**అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా సాగిన వాదనలు**

**బాధితురాలి వాంగ్మూలం చూశాక ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసిన న్యాయమూర్తి**

కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టులో ఊరట లభించలేదు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం శుక్రవారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘ విచారణ జరిపింది. ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని జస్టిస్ టి.మాధవీదేవి స్పష్టం చేశారు. అయితే, అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేశారు.శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి దాదాపు 12 గంటల వరకు ఇరుపక్షాల వాదనలను న్యాయమూర్తి విన్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని పరిశీలించిన తర్వాత ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. దర్యాప్తునకు సహకరిస్తామని, అప్పటివరకూ అరెస్ట్ వంటి చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరగా న్యాయమూర్తి అందుకు నిరాకరించారు.

ఇరుపక్షాల వాదనలు

పిటిషనర్‌ను ఇరికించేందుకే కఠిన సెక్షన్లు చేర్చారని, ఇది ఇరుపక్షాల అంగీకారంతో ఉన్న సంబంధమని, అది బెడిసికొట్టడంతోనే ఈ కేసు పెట్టారని భగీరథ్ తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదించారు. అయితే, ప్రాసిక్యూషన్ వాదనలు దీనికి భిన్నంగా ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ రికార్డుల ప్రకారం బాధితురాలి వయసు 18 ఏళ్లలోపే ఉందని, ఆమె వాంగ్మూలం తర్వాత మరింత కఠినమైన పోక్సో సెక్షన్లు చేర్చామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు తెలిపారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలి తరపు న్యాయవాది పప్పు నాగేశ్వరరావు ఆరోపించారు.ఈ కేసు విచారణ సందర్భంగా తనపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న దుష్ప్రచారంపై న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేయడంతో ఈ కేసులో ఉత్కంఠ కొనసాగుతోంది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
మే । శనివారం । 16 । 2026



# ప్రేమ పేరుతో మోసం.. చివరకు కటకటాల్లోకి ఎస్సై సురేష్

**మహిళా కానిస్టేబుల్‌ను పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేసిన ఎస్సై అరెస్ట్**

**మన దునియా,హైదరాబాద్,మే 15**

ప్రేమ, పెళ్లి పేరుతో మహిళా కానిస్టేబుల్‌ను మోసం చేసి, శారీరకంగా వాడుకున్న అనంతరం వివాహానికి నిరాకరించిన ఎస్సై సురేష్‌ను కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నిందితుడిని రిమాండ్‌కు తరలించగా, ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.పోలీసుల కథనం ప్రకారం.. విధి నిర్వహణలో పరిచయమైన మహిళా కానిస్టేబుల్‌తో ఎస్సై సురేష్ సన్నిహితంగా మెలిగాడు. ప్రేమిస్తున్నానని, త్వరలోనే పెళ్లి చేసుకుంటానని నమ్మకం కల్పిస్తూ ఆమెకు దగ్గరయ్యాడు. అయితే ఇప్పటికే తనకు వివాహం జరిగిందన్న విషయాన్ని కావాలనే దాచిపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక సందర్భంలో గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టి "ఇప్పటి నుంచి మనిద్దరం భార్యాభర్తలమే" అంటూ నమ్మించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆ నమ్మకంతో ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడినట్లు సమాచారం. కొంతకాలం తర్వాత ఎస్సైకి ఇప్పటికే భార్య ఉన్న విషయం బయటపడటంతో మహిళా కానిస్టేబుల్ తీవ్ర ఆవేదనకు గురైనట్లు తెలిసింది. ఈ విషయంపై నిలదీయగా.. "భార్యకు విడాకులు ఇచ్చి నిన్నే పెళ్లి చేసుకుంటా" అంటూ ఎస్సై సురేష్ రెండేళ్లపాటు కాలయాపన చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే సమయంలో బాధితురాలు గర్భవతి కావడంతో, మాయమాటలు చెప్పి అబార్షన్ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.అనంతరం వివాహం గురించి




ప్రశ్నించగా, "నేను ఎస్సైని.. నిన్నెలా పెళ్లి చేసుకుంటా?" అంటూ తిరస్కరించినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళా కానిస్టేబుల్ ఈ ఏడాది ఏప్రిల్ 1న కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్సై సురేష్‌ను విచారణకు పిలిచినా, ఆయన ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పరారైనట్లు గుర్తించారు. దాదాపు నెలన్నరపాటు గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా మోసం, లైంగిక దాడి సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అధికార హోదాను అడ్డం పెట్టుకుని మహిళను మోసం చేశాడన్న ఆరోపణలపై పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. ప్రస్తుతం కేసుపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

# అందుకే వాళ్లకు వణుకు పుడుతుంది: టీపీసీసీ చీఫ్

**మన దునియా,హైదరాబాద్,మే15**

కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు దొంగ ఓట్లతో గెలిచారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. అందుకే వాళ్లకు వణుకుపుడుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డితో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. రాష్ట్రంలో జరగనున్న సర్ ప్రక్రియపై సుదర్శన్ రెడ్డితో వారు చర్చించారు.అనంతరం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. 14 రాష్ట్రాల్లో సర్ (SIR) ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. దుర్మార్గంగా ఓట్ల ప్రక్రియ జరిగిందంటూ మండిపడ్డారు. అందుకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలే నిదర్శమన్నారు. దేశంలో 8.2 కోట్ల ఓట్లు జోడిస్తే.. 5.90 లక్షల ఓట్లు తొలగించారని విమర్శించారు. బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలు మారి అధికారంలోకి రావాల్సిన పార్టీలు ఓటమి పాలయ్యాయన్నారు. బెంగాల్‌లో 90 లక్షల ఓట్లు తొలగించి.. 60 లక్షలు కలిపారని చెప్పారు.తెలంగాణలో వచ్చే రెండు ఏళ్లలో ఎన్నికలు లేవన్నారు. ఈ నేపథ్యంలో సర్ ప్రక్రియ ఏడాది జరపాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని తాము కోరామని టీపీసీసీ చీఫ్ తెలిపారు. పేదల ఓట్లు తొలగిస్తే వారు సరైన డాక్యుమెంట్లు ఇవ్వలేరన్నారు. ఈ నేపథ్యంలో అందుకు 3 నెలలు సమయం ఇవ్వాలని చెప్పారు. మూడు సార్లు బీఎల్‌వోలు.. వారి ఇంటికి వెళ్లి పరిశీలన చేయాల్సి ఉందని తెలిపారు.కొన్ని చోట్ల బయట దేశస్థులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన



వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా SIR జరగాల్సి ఉందని ఆకాంక్షించారు. బీజేపీకి పడని ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎవరి ఓట్లు వారే కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. జూన్ 25 నుంచి తెలంగాణలో SIR ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపా రు. జూలై 24 దాకా ఓటర్ల వివరాల సేకరణ ఉంటుందన్నారు. అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల జాబితా ప్రచురణ చేస్తారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు..

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు.. కేంద్రంపై టీపీసీసీ చీఫ్ తీవ్ర ఆగ్రహం

**మన దునియా,హైదరాబాద్:మే 15**

హైదరాబాద్: పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను మళ్లీ పెంచిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఆగ్రహించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నాయని, దేశంలో మాత్రం పెట్రోల్ రేట్లను పెంచి కేంద్రం దోచుకుంటోందని మహేశ్ గౌడ్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వ చర్యలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందన్నారు. చివరకు సామాన్యుడు తీవ్రంగా నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు.ప్రజా సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు..




## సంగెం మమ్నూర్ పర్వతగిరి వర్ధన్నపేట లో గత వారం రోజులుగా జరుగుతున్న బ్యాటరీ దొంగతనాలకు సంగెం పోలీసుల చెక్

**మన దునియా, సంగెం. మే 15**



మే 9 మరియు 10 వ తేదీల్లో గావిచర్ల, రామచంద్రపురం, తిమ్మాపూర్ గ్రామాలలో జరిగిన స్వర్గ రథం యొక్క బ్యాటరీ దొంగతనాలను సంగెం పోలీసులు వెంటనే కేసు రిజిస్టర్ చేసి, పర్వతగిరి సిఐ రాజగోపాల్ సూచనలు మేరకు సంగెం ఎస్సై వంశీ కృష్ణ తన హెడ్ కానిస్టేబుల్ సంతోష్, బాబు కానిస్టేబుల్స్ శ్రవణ్, నవీన్ కిషోర్ మరియు వీరన్న లు టీం గా ఏర్పడి నమ్మదగిన సమాచారం మేరకు ఈరోజు తిమ్మాపూర్ సబ్స్టేషన్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఇద్దరు నిందితులు 1. గూడూరు అరవింద్ 2. హింగిరి బన్నీ =శీ తీగరాజుపల్లి తమ స్కూటీ మీద 6 దొంగలించబడిన బ్యాటరీస్నీ తరలిస్తుండగా అరెస్ట్ చేసి చూడగా, వారు 9 మరియు 10 వ తేదీల్లో మమ్నూర్, పర్వతగిరి, ఉప్పరపల్లి, గావిచర్ల, రామచంద్రపురం తిమ్మాపూర్ లలో స్వర్గ రథం యొక్క ఏఁవతీఅవం దొంగతనం చేసి ఈరోజు వరంగల్ లో అమ్ముదమని వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుండి 6 బ్యాటరీస్ మరియు స్కూటీ సీజ్ చేసి అరెస్ట్ చూపించారు, ఈరోజు పర్వతగిరి సిఐ రాజగోపాల్ సంగెం పోలీస్ స్టాఫ్ ను అభినందించారు.

## నీట్-యూజీ లీక్‌పై సీబీఐ ఉక్కుపాదం

**దేశవ్యాప్తంగా సోదాలు.. అనువాద ప్యానెల్ పాత్రపై అనుమానాలు**

**మన దునియా న్యూఢిల్లీ:మే 15**




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ భారీ కుట్ర వెనుక పరీక్ష నిర్వహణ వ్యవస్థలోని అంతర్గత వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రశ్నాపత్రాల తయారీ, భద్రపరిచే విధానం, పంపిణీ ప్రక్రియ వంటి అత్యంత గోప్య విభాగాల్లో పనిచేసే వ్యక్తుల సహకారం లేకుండా ఇంత పెద్ద లీకేజీ సాధ్యం కాదనే కోణంలో సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది.ఈ కేసులో మహారాష్ట్రలోని పుణె, లాతూర్ ప్రాంతాలు దర్యాప్తుకు కేంద్ర బిందువులుగా మారాయి. పుణెలో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న మనీషా వాఘ్మారే అనే మహిళను సీబీఐ అరెస్ట్ చేయడం కేసులో కీలక మలుపుగా మారింది. ఆమె ఈ లీకేజీ నెట్‌వర్క్‌లో మధ్యవర్తిగా వ్యవహరిస్తూ, దాదాపు రెండు డజన్ల బ్యాంక్ ఖాతాల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికే అరెస్టైన ధనంజయ్ అనే బీఏఎంఎస్ గ్రాడ్యుయేట్‌తో ఆమెకు సంబంధాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా 13 భాషల్లో నిర్వహించబడుతున్న నేపథ్యంలో, అనువాద ప్యానెల్ సభ్యుల పాత్రపై కూడా సీబీఐ దృష్టి సారించింది. లాతూర్‌కు చెందిన ఓ రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌ను అదుపులోకి తీసుకోవడం కలకలం రేపుతోంది. ఆయన ప్రశ్నాపత్రాన్ని మరాఠీలోకి అనువదించే ప్యానెల్‌లో సభ్యుడిగా ఉండటంతో, పూర్తి ప్రశ్నాపత్రాన్ని ముందుగానే చూసే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు.ఇక లాతూర్‌లోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్ నిర్వహించిన మాక్ టెస్ట్‌లో 42 ప్రశ్నలు అసలు నీట్ పేపర్‌తో సరిపోలినట్టు గుర్తించడం కేసును మరింత తీవ్రంగా మార్చింది. ఆ మాక్ టెస్ట్ పేపర్‌కు, లీకైన అసలు ప్రశ్నాపత్రానికి మధ్య ఉన్న సంబంధాలను సీబీఐ నిశితంగా పరిశీలిస్తోంది.ఈ వ్యవహారాన్ని "పెద్ద కుట్ర"గా అభివర్ణించిన సీబీఐ, గురువారం దేశవ్యాప్తంగా 14 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఇప్పటివరకు అరెస్టయిన ఏడుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని ఏడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగించింది. ఈ విచారణలో లీకేజీ మూలాలు, అలాగే దీని వెనుక ఉన్న మరికొంతమంది కీలక వ్యక్తుల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ కేసులో ఎవరినీ వదిలిపెట్టబోమని సీబీఐ స్పష్టం చేసింది.

## ఇంధన ధరలు పెంపును రాజకీయంగా వాడుకుంటున్న పార్టీలు: మంత్రి కిషన్ రెడ్డి ఫైర్

**మన దునియా,హైదరాబాద్,మే 15**



పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పని పాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు.శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్యమైందన్నారు.అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వివరించారు.పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంచిన ధరలు ఈ రోజు (శుక్రవారం) ఉదయం 6.00 గంటల నుంచి అమల్లోకి వస్తాయని తెలిపాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు..

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్..

**మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్**

**తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్**

**యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును కోరిన బండి సంజయ్**

**మన దునియా,హైదరాబాద్:మే 15**




కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు తనపైన దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును బండి సంజయ్ కోరారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోందని న్యాయస్థానానికి బండి సంజయ్ వివరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో బండి సంజయ్‌పై వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. యూట్యూబ్, సోషల్ మీడియాలో బండి సంజయ్‌కి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది..

## సర్వేయర్ 'సెటిల్‌మెంట్'.. బదిలీల నిబంధనలకు తూట్లు!

**మోపాల్, మే 15,నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఒకే చోట గరిష్ఠంగా మూడు నుండి నాలుగు ఏళ్లు మాత్రమే పని చేయాలి. కానీ, మోపాల్ మండలంలో పనిచేస్తున్న మహిళా సర్వేయర్ స్వప్న విషయంలో మాత్రం ఈ నిబంధనలు చుట్టన చుట్టి పక్కన పెట్టినట్లు కనిపిస్తోంది. ఆమె తన సర్వీసులో మెజారిటీ కాలం ఒకే పరిసర ప్రాంతాల్లో గడపడం గమనార్హం. గతంలో నిజామాబాద్ సౌత్ రూరల్ పరిధిలో సుమారు రెండున్నర ఏళ్ల పాటు సర్వేయర్‌గా విధులు నిర్వహించిన ఈమె, అక్కడి నుండి నేరుగా మోపాల్‌కు బదిలీపై వచ్చారు. అప్పటి నుండి అంటే గడిచిన ఆరు సంవత్సరాలుగా ఆమె ఇక్కడే పాతుకుపోయారు. మొత్తంగా చూస్తే దాదాపు తొమ్మిది ఏళ్ల సర్వీసులో ఏడున్నర ఏళ్లు ఒకే నియోజకవర్గ లేదా జిల్లా పరిసరాల్లోనే కొనసాగుతుండటం ఇప్పుడు జిల్లా రెవెన్యూ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమెపై పలు ఆరోపణలు వినిపిస్తున్న ఉన్నత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆంతర్యం ఏమిటో? మీ సంవత్సరాలుగా ఒకే చోట పని చేయడంతో ఆమెపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆమెను బదిలీ చేయాల్సిందిగా పలువురు గ్రామస్తులు కోరుచున్నారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు సంప్రదింపులు జరిపి బదిలీ కాకుండా చూడాలని ప్రజాప్రతినిధులను ఇంటి చుట్టూ తిరుగుతున్నట్టు సమాచారం. పైరవీలు మొదలుపెట్టినట్లు గ్రామస్తులు గుసగుస పెడుతున్నారు. ఏ అధికారైన ప్రభుత్వ నిబంధన ప్రకారం మూడు నుంచి నాలుగు సంవత్సరాల కాల వ్యవధిలోనే బదిలీ కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజా ప్రతినిధుల అండదండలతో బదిలీ కావడం లేదని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి?

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారితో పీసీసీ చీఫ్ భేటీ.. ఓటర్ల జాబితా సవరణపై చర్చ

**మన దునియా,హైదరాబాద్:మే 15**




తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో అక్రమాలు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా లేని ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రతిపక్షాలకు పడే ఓట్లను టార్గెట్ చేస్తూ తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 'ఓటర్లందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరి ఓట్లను వారే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు తమ ఓటు హక్కు జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి' అని అన్నారు. ఈ భేటీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఓటర్ల జాబితాలో పారదర్శకత పాటించాలని ఎన్నికల

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ





**గ్రామ,సర్పంచ్, లికిత స్వామి**

**మానవత్వం చాటిన గ్రామ సర్పంచ్**

**గ్రామ సర్పంచ్ పలువురు అభినందనలు**

**పలు పంచాయతీలకు ఆదర్శ సర్పంచ్**

**ఉమ్మడినిజామాబాద్ ప్రతినిధిజిల్లా మన దునియా**

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నర్సింగ్ పల్లి గ్రామ సర్పంచ్ నర్సంపల్లి గ్రామ సర్పంచ్ లిఖిత స్వామి శుక్రవారం నాడు ఉపాధి హామీ పనులను పరిశీలించారు పనులను పరిశీలించారు ఉపదామి కూలీలతో గ్రామ సర్పంచ్ లికిత స్వామి ,మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు, ప్రతిరోజు ఉపాధి హామీ పనులను పరిరక్షిస్తూ ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూస్తానని ఉపాధి కూలీలకు హామీ ఇవ్వడం జరిగింది . ఇలాంటి సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. మెడికల్ కిట్లు మరియు త్రాగు నీరు, అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు తెలిపారు. ఎండలో కష్టపడుతున్న ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. దీంతో ఉపాధి కూలీలు గ్రామ సర్పంచ్ సేవలను అభినందినీయమని పలువురు. గ్రామ సర్పంచ్ అభినందించారు. సర్పంచ్ లిఖిత ,స్వామి, సర్పంచ్ గ్రామ ఉపసర్పంచ్ రఘురాం , గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేష్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు

## తాసిల్దార్ కార్యాలయంలో కనీస వసతులు కరువు







**మౌలిక వసతులు లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు**

**తాసిల్దార్ కష్టం వస్తే ఎవరికి చెప్పాలి?**

**మన దునియా స్పెషల్ ఫోకస్**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు కరువు తాసిల్దార్ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదులు గాని. భూ సమస్యల పైన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఎక్కువ మంది తాసిల్దార్ కార్యాలయానికి వస్తూ ఉంటారు. అయితే తాసిల్దార్ కి కష్టం వస్తే ఎవరికి చెప్పాలి?మరుగుదొడ్లు బాత్రూమ్స్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది. వారి బాధలు వర్ణనాతీతం ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి మహిళా ఉద్యోగులు ఎక్కువమంది ఉండటంతో ఉదయం 10 గంటల నుండి సాయంకాలం వరకు ఆఫీసులో పనిచేస్తూ ఉంటే వారికి కనీస మౌలిక వస్తువులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదుదారులు ప్రజలు తాసిల్దార్ కార్యాలయానికి రావాలంటే బాత్రూమ్స్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఎంతైనా ఉంది. కానీ మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రజా ప్రతినిధులకు ఈ విషయం తెలియదా? మండల మెజిస్ట్రేట్ కి మౌలిక వసతులు లేకపోవడం మండలంలో హాట్ టాపిక్ గా మారింది. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి తాసిల్దార్ కార్యాలయాన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుచున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై బిగ్ అప్‌డేట్..

**మంత్రి పొంగులేటి ప్రకటన**

**మన దునియా,హైదరాబాద్:మే 15**

జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. తొలి విడతలో మూడు లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పుకొచ్చారు. 2.90 లక్షల ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి అయిందని.. ఇప్పటికే 50 వేల గృహప్రవేశాలు పూర్తి చేశామని వివరించారు. వరంగల్, ఖమ్మం జిల్లా హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. మరో 2 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని ప్రస్తావించారు. ఐటీడీఏ ప్రాంతాలకు అదనపు ఇళ్లు కేటాయిస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు..

అర్హులందరికీ ఇళ్లు వచ్చే వరకు 3, 4 విడతలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాత ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడా కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. 600 చదరపు అడుగుల ఇళ్ల బిల్లులు క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఫారెస్ట్, సింగరేణి అడ్డంకులు సృష్టించవద్దని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉచిత ఇసుక సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఖమ్మం, వరంగల్‌లో భూ వివాదాలపై జాయింట్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రోవర్స్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు..



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# 17వ తేదీ నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం

**కొద్ది రోజులు పెళ్లిళ్లకు సెలవ్..**

**మన దునియా హైదరాబాద్:డెస్క్ మే 15**

హిందూ ధర్మశాస్త్రం ప్రకారం కాలగణనలో అధిక మాసం అత్యంత విశిష్టమైనది. సాధారణంగా శుభకార్యాలకు ఈ మాసం నిషిద్ధమని మనందరికీ తెలుసు. అయితే, లౌకిక సుఖాల కంటే ఆధ్యాత్మిక పురోభివృద్ధికి, దైవచింతనకు ఈ మాసం ఒక వరం వంటిది. “అధికస్య అధికం ఫలం” అన్న నానుడి ప్రకారం.. ఈ మాసంలో చేసే చిన్న పుణ్యకార్యమైనా వేయి రెట్లు ఫలితాన్ని ఇస్తుంది. 2026వ సంవత్సరంలో మే 17వ తేదీ నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం కానుంది. ఈ అధిక జ్యేష్ఠమాసంలో ఏం చేయవచ్చు...ఏం చేయకూడదో తెలుసుకుందాం.

**అసలు అధిక మాసం అంటే ఏమిటి?**

సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని ‘సంక్రాంతి’ అంటారు. ఏ మాసంలో అయితే సూర్య సంక్రమణం జరగదో, ఆ మాసాన్ని అధిక మాసం అంటారు. శాస్త్రీయంగా చూస్తే, సౌరమానానికి (365 రోజులు), చాంద్రమానానికి (354 రోజులు) మధ్య ఉండే 11 రోజుల తేడాను సరిచేయడానికి ప్రతి 33 నెలలకు ఒకసారి ఒక నెలను అదనంగా చేరుస్తారు. ఇదే అధిక మాసం. పురుషోత్తమ మాసం వెనుక ఉన్న పరమార్థం పురాణాల ప్రకారం, ఈ మాసానికి అధిపతి లేకపోవడంతో దీనిని అందరూ నిరసించేవారట. అప్పుడు శ్రీమహావిష్ణువు కరుణించి, ఈ మాసానికి తన పేరైన ‘పురుషోత్తమ’ నామాన్ని ఇచ్చి, దీనికి అధిపతిగా మారారు. అందుకే ఈ నెలలో విష్ణుమూర్తి ఆరాధన అనంతమైన ఫలితాలనిస్తుంది. ఈ అధికమాసంలో పురుషోత్తముడైన శ్రీ మహావిష్ణువును విరాజమానంగా ఆరాధిస్తారు. సత్యనారాయణ వ్రతాలు విరివిగా చేస్తారు.

**ఆలయం ఏమి చేయాలి? ఏమి చేయకూడదు?**

అధిక మాసంలో వివాహాలు, గృహప్రవేశాలు, ఉపనయనాలు వంటి లౌకిక శుభకార్యాలు చేయకూడదు. కానీ, అంతకంటే గొప్పవైన పనులు



తప్పనిసరిగా చేయాలని శాస్త్రం చెబుతోంది. ఈ మాసంలో ఇష్టదైవం నామస్మరణ, గాయత్రీమంత్రం జపం, నరసింహ కవచం వంటివి పఠించడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుంది. అంతేకాదు, ఈ మాసంలో పండ్లను, పిండి వంటలను, స్వయంపాకాన్ని దానం చేయడం వలన సుఖశాంతులు లభిస్తాయి. ముఖ్యంగా ద్వాదశి, పౌర్ణమి, అమావాస్య తిథుల్లో ఈ దానాలు చేయాలి. పితృదేవతల సద్గతి కోసం ఈ మాసమంతా సంధ్యాసమయంలో దీపం వెలిగించాలి. ఇలా చేయడం వలన పితృదేవతలు సంతోషించి కుటుంబానికి, వంశాభివృద్ధికి సహకరిస్తారు. ఇక ఈ మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు, నవగ్రహ హోమాలు, శాంతిపూజలు నిర్వహిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే అధిక మాసం అంట విరామం అని అర్థం కాదు. భక్తికి ఇచ్చే అదనపు సమయం. బాహ్యమైన వేడుకలకు దూరంగా ఉంటూ...అంతరంగంలో దైవాన్ని నింపుకోవడానికి ఇది ఓ మంచి అవకాశం. 2026 మే 17 నుంచి ప్రారంభమయ్యే ఈ పురుషోత్తమ మాసంలో పుణ్యకార్యాలను చేద్దాం. ఆ స్వామివారి అనుగ్రహాన్ని పొందుదాం.

# హరిత నిధి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలి

**-- మంత్రి కొండా సురేఖ**

**మన దునియా,హైదరాబాద్:మే 15మే**

హరిత నిధి 7వ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖగారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గతంలో మంజూరైన ప్రాజెక్టుల అమలు పురోగతిని మంత్రి సమీక్షించగా, పలు కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు.నర్సరీల ఏర్పాటు, అర్బన్ పార్కుల అభివృద్ధి, అటవీ సంరక్షణ, అటవీ పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, ఎకోటూరిజం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం లభించింది.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖగారు మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు హరిత నిధి కీలక వేదికగా పనిచేస్తోందన్నారు. అడవుల సంరక్షణతో పాటు పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని



తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ప్రాజెక్టు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు.

# దుబాయ్ జైల్లో ఉన్న వ్యక్తిని స్వదేశానికి తీసుకురావాలని ప్రజాభవన్ లో వినతి

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ప్రతినిధి మే;15.**

హైదరాబాద్ ప్రజా భవన్ లో ఈరోజు ప్రజాభవన్‌లో సీఎం ఆఫీస్‌ను సందర్శించిన సాయి పవన్ గౌడ్, మంద భీమ్ రెడ్డి సహకారంతో ఒక బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. గల్ఫ్ దేశమైన దుబాయ్‌లో జైలులో ఉన్న తిరుపతి అనే వ్యక్తిని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులతో కలిసి కన్వీనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమస్యను పూర్తిగా వివరించి, తిరుపతిని త్వరలోనే స్వదేశానికి తీసుకురావడానికి సహకరించాలని కోరారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, తన వంతు శాయశక్తులా కృషి చేస్తున్న సాయి పవన్ గౌడ్ సేవలను కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.




# అటవీ భూమి ఆక్రమణ కేసులో నిందితుడు అరెస్ట్

**15 రోజుల రిమాండ్ విధించిన కోర్టు**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ప్రతినిధి మే;15.**

మంచిర్యాల్ జిల్లా జన్నారం రేంజ్ పరిధిలోని జన్నారం సెక్షన్, కవ్వాల్ కోర్ ఏరియా పరిధిలో ఉన్న గడ్డం గూడ ప్రాంతంలో అటవీ భూమి ఆక్రమణకు సంబంధించిన కేసులో భూక్యా బలరాం అనే వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.అక్టోబర్ నెలలో నమోదైన ఈ కేసులో కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిందితుడిని నిన్న అరెస్ట్ చేసి మంచిర్యాల కోర్టులో హాజరుపరచగా, గౌరవ న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం అతడిని ఆదిలాబాద్ జిల్లా కారాగారానికి తరలించినట్లు ఎఫ్ ఆర్ వో లక్ష్మీనారాయణ తెలిపారు.అటవీ భూములను ఆక్రమిస్తూ అటవీ సంపదను నాశనం చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని అటవీ శాఖ స్పష్టం చేసింది.




# వరుసకు కూతురైన మైనర్‌పై బాబాయ్ దారుణం..!

**బెదిరింపులతో పలుమార్లు అత్యాచారం**

**సోషల్ మీడియాలో ఫోటోలు పెడతానని బెదిరించి లైంగిక దాడి.. తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘోరం**

**మన దునియా,హైదరాబాద్, మే 15 :**



సమాజాన్ని కలచివేసే ఘోర ఘటన వెలుగులోకి వచ్చింది. వరుసకు కూతురైన 16 ఏళ్ల మైనర్ బాలికపై ఆమె బాబాయ్ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కుటుంబ బంధాలను మరిచి అమానుషంగా ప్రవర్తించిన నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల బాలిక ఇటీవల వేసవి సెలవుల సందర్భంగా తిరుపతిలో నివసిస్తున్న తన పిన్ని ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పిన్ని భర్త రామమూర్తి బాలికను బెదిరింపులకు గురిచేస్తూ ఆమె వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ మానసికంగా భయపెట్టాడు. ఆ బెదిరింపులను ఆసరాగా చేసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం.కొద్ది రోజుల తర్వాత పరీక్షల కోసం హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన బాలిక తీవ్ర మానసిక ఆందోళనలో ఉండటాన్ని గమనించిన తల్లి, కుమార్తెను ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. దీంతో షాక్‌కు గురైన కుటుంబ సభ్యులు వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించారు.బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఘటన తిరుపతి పరిధిలో జరగడంతో కేసును తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడు రామమూర్తిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన మరోసారి బాలికల భద్రతపై ఆందోళనలు రేకెత్తిస్తోంది. కుటుంబ సభ్యులే నేరాలకు పాల్పడుతున్న సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని మహిళా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే పిల్లల ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే స్పందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## సి.బి.ఐ వేట.!

**దేశవ్యాప్త సోదాలు..**

**నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో...**

**మహారాష్ట్రలోని పుణె, లాతూర్ ప్రాంతాలు దర్యాప్తుకు కేంద్ర బిందువులుగా...**

**అనువాద ప్యానెల్ నుంచి లీక్?..**

**మన దునియా,న్యూఢిల్లీ:మే15**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తన విచారణను మరింత ముమ్మరం చేసింది. ఈ భారీ కుట్ర కేవలం బయటి వ్యక్తులకు పరిమితం కాదని, పరీక్ష నిర్వహణ వ్యవస్థలోని అంతర్గత వ్యక్తుల ప్రమేయం లేకుండా ఇంత పటిష్టమైన వ్యవస్థను ఛేదించడం అసాధ్యమని సీబీఐ బలంగా అనుమానిస్తోంది. ప్రశ్నాపత్రాల తయారీ, నిల్వ, పంపిణీ వంటి అత్యంత గోప్యంగా ఉంచాల్సిన విభాగాల్లో పనిచేసే వారే ఈ లీకేజీకి సూత్రధారులుగా ఉన్నారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.

ఈ కేసులో మహారాష్ట్రలోని పుణె, లాతూర్ ప్రాంతాలు...

ఈ కేసులో మహారాష్ట్రలోని పుణె, లాతూర్ ప్రాంతాలు దర్యాప్తుకు కేంద్ర బిందువులుగా మారాయి. పుణెలో బ్యూటీ పార్లర్ నడిపే మనీషా వాఘ్మారే అనే మహిళను సీబీఐ అరెస్ట్ చేయడం కీలక మలుపుగా మారింది. ఆమె ఈ నెట్‌వర్క్‌లో మధ్యవర్తిగా వ్యవహరిస్తూ, దాదాపు రెండు డజన్ల బ్యాంక్ ఖాతాల ద్వారా విద్యార్థుల నుంచి, తల్లిదండ్రుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయి. ఆమెకు ఇప్పటికే అరెస్టయిన ధనంజయ్ అనే బీఏఎంఎస్ గ్రాడ్యుయేట్‌తో సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అనువాద ప్యానెల్ నుంచి లీక్?..

నీట్ పరీక్ష 13 భాషల్లో జరుగుతుండటంతో, అనువాదకుల పాత్రపై సీబీఐ దృష్టి సారించింది. లాతూర్‌కు చెందిన ఒక రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకోవడం కలకలం రేపింది. సదరు ప్రొఫెసర్ ప్రశ్నాపత్రాన్ని మరాఠీలోకి అనువదించే ప్యానెల్‌లో సభ్యుడిగా ఉండటంతో, అతనికి పూర్తి పేపర్ చూసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. లాతూర్‌లోని ఒక ప్రైవేట్ కోచింగ్ సెంటర్ నిర్వహించిన మాక్ టెస్ట్‌లో 42 ప్రశ్నలు అసలు నీట్ పేపర్‌తో సరిపోలడం ఈ అనుమానాలను మరింత బలపరుస్తోంది. ఆ మాక్ టెస్ట్ పేపర్‌కు, లీకైన అసలు పేపర్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని సీబీఐ నిశితంగా పరిశీలిస్తోంది.

దేశవ్యాప్త సోదాలు..

ఈ కేసును ‘పెద్ద కుట్ర’గా అభివర్ణించిన సీబీఐ, దర్యాప్తులో భాగంగా గురువారం దేశవ్యాప్తంగా 14 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఇప్పటివరకు అరెస్టయిన ఏడుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని ఏడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగించింది. ఈ కస్టడీ విచారణలో లీకేజీ మూలాలతో పాటు, దీని వెనుక ఉన్న మరికొంతమంది పెద్దల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ కేసులో దోషులను వదిలే ప్రసక్తే లేదని దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# మోసకారితనం!

రైతే దేశానికి వెన్నెముక అని ఘనంగా ప్రసంగాలు దంచే మోడీ ప్రభుత్వం, ఆచరణలో అన్నదాతలను అడుగడుగునా ఆశాభంగానికి గురిచేస్తోంది. పెట్టుబడులు, ఎరువుల ధరలు ఏటేటా 20 – 30 శాతానికి పైబడి పెరిగిపోతుంటే, కనీస మద్దతు ధరల ప్రకటన మాత్రం ఇంకా అరకొరగానే అఘోరిస్తోంది. బుధవారం నాడు కేంద్ర ప్రభుత్వం 13 రకాల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు కంటితుడుపు చర్య కన్నా అధ్వానం.



వాస్తవ పరిస్థితుల పట్టింపు లేకుండానే ఏదో తూతూమంత్రపు తంతుగా ఉంది. రెండు వారాల క్రితం ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిన లెక్కలు తాజాగానే ఉన్నాయి. ఆ భారాన్ని తట్టుకునే స్థాయిలోనైనా పంటలకు కనీస మద్దతు లేకపోవటం రైతుల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని, నిర్వాచీతనాన్ని తేటతెల్లం చేస్తోంది. 2026–27 సీజనుకు గానూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు క్షేత్రస్థాయి పరిశీలనను గానీ, రైతు సంఘాల విజ్ఞప్తులను గానీ కొంతమాత్రంగానైనా ప్రతిబింబించటం లేదు. గతేడాదితో పోలిస్తే ఎరువులు, పురుగుల మందుల ధరలు 30 శాతం దాకా పెరిగాయి. ట్రాక్టరు, ఇతర యంత్ర ఉపకరణాల నిర్వహణ వ్యయం, అద్దెలూ పెరిగాయి. త్వరలో డీజిలు ధర పెరగనుందన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. అమెరికా సృష్టించిన యుద్ధ బీభత్సం ఇప్పటికే ఎరువులు, ఇతర సామగ్రి ప్రియం అయిపోవటానికి కారణమైంది. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడి, ఈ ఏడాది వర్షపాతం తగిన స్థాయిలో ఉండకపోవొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రైతాంగం పట్ల ప్రేమ ఉన్న ఏ ప్రభుత్వమైనా ఏం చేయాలి? దేశంలో 60 శాతం గ్రామీణ ప్రాంతానికి ఆదరువుగా నిలుస్తున్న వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలవాలి. రైతుకు భరోసా ఇచ్చే సహాయ సహకారాల ప్రణాళికతో ముందుకు రావాలి. కానీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతులను మార్కెట్టుకు, పరిస్థితులకు వదిలేసి, చోద్యం చూస్తున్నాయి. కాబట్టే, ఇప్పటికే యుద్ధం కారణంగా నెలకొన్న పరిస్థితులకు వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోయి, మన రైతులు దారుణంగా నష్టపోయారు. దానికి ముందు అమెరికా విధించిన టారిఫ్‌లకూ అన్నదాతలు బలయ్యారు. అప్పుడూ, ఇప్పుడూ మోడీ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోంది తప్ప, రైతులను ఆదుకునే ఆచరణకు పూనుకోలేదు. అలాంటి స్పృహ కొంత ఉన్నా, క్వింటా ధాన్యానికి గతేడాది కన్నా రూ.72లు మాత్రమే పెంచి, చేతులు దులుపుకొని ఉండేది కాదు. మొక్కజొన్నకు రూ.10 లు, పెసలుకు రూ.12 లు మాత్రమే విదిల్చి ఉండేది కాదు. కొన్ని పంటల ధరలు వందల్లో పెంపు కనిపిస్తున్నా, పెరిగిన ఖర్చుతో పోలిస్తే మద్దతు అనేది ప్రహసనంగానే అనిపిస్తోంది. నిజానికి ఆహార పంటల సాగు చాలా కాలంగా సంక్షోభంలో ఉంది. స్వామినాథన్ కమిషన్ సూచించిన మద్దతు ధర ఫార్ములా సి2 ప్లస్ 50 శాతం అనేది అమలు చేస్తే కొంతలో కొంత ఊరట. రైతు వివిధ రూపాల్లో పెట్టిన పెట్టుబడిని, ఇంటిల్లిపాది శ్రమను సాగు వ్యయంగా లెక్కించి, దానికి 50 శాతం జోడించి– పంట ధర నిర్ణయించాలనేది ఈ ఫార్ములా సారాంశం! పాలకులు దీనిని పట్టించుకోకపోగా, సాగు భారాన్ని మరింత పెంచే చర్యలు చేపడుతున్నారు. గతేడాది మోడీ ప్రభుత్వం ఎరువుల సబ్సిడీకి బడ్జెట్లో కేటాయించిందే తక్కువ అనుకుంటే, ఆ తరువాత 16 వేల కోట్ల మేర నిధులకు కోత పెట్టింది. అలాగే, మద్దతు ధరల అమలుపై ఎలాంటి పర్యవేక్షణా చేపట్టకుండా మార్కెట్ శక్తుల ఇష్టానుసారానికి వదిలేస్తోంది. లోపభూయిష్టమైన, నిర్లక్ష్యపూరితమైన ఈ బాధ్యతారాహిత్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ స్వస్తి పలకాలి. అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయోత్పత్తులకు పెద్దఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చి ముందుకు సాగుతుంటే, భారత రైతాంగానికి భారాల ముకుతాడు వేయటం దారుణం. దేశ సౌభాగ్యానికి, ఆరోగ్యానికి రైతు ఒక కీలకమైన పాత్రధారి అని గుర్తించి, వ్యవసాయ రంగాన్ని బలంగా నిలబెట్టటానికి చిత్తశుద్ధితో వ్యవహరించాలి. గట్టి చేతలు లేని ప్రతి వట్టి మాటా మోసకారితనంగానే మిగులుతుంది!

## నిర్మల్: అటవీలో మహిళ మృతదేహం 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

మన దునియా,నిర్మల్ జిల్లా ఖానాపూర్,తర్లపాడ్:మే15

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం లభ్యమైన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. భర్తే పథకం ప్రకారం భార్యను హత్య చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బొమ్మెన మౌనిక అలియాస్ నల్ల మౌనిక అదృశ్యమైనట్లు ఈ నెల 9న మిస్సింగ్ కేసు నమోదైంది. మే 14న అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యమవడంతో హత్య కేసుగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా విచారణలో భర్త నల్ల అరుణ్పై అనుమానం వ్యక్తమైంది. అదనపు కట్నం వేధింపులు, కుటుంబవిభేదాలు, అక్రమ సంబంధాల నేపథ్యంలో భర్త భార్యను హత్య చేసినట్లు తేలింది.....




# అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే నెపంతోతెలంగాణ ఉద్యమకారుల అక్రమ అరెస్టులను ఖండించండి

మన దునియా,నల్లబెల్లి:మే15

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబరావు, జేఏసీ నల్లబెల్లి మండల చైర్మన్ వేముల రాజు, అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపకులు తెలంగాణ ఉద్యమకారులు పరికి కోర్నేల్ మాదిగ ప్రభుత్వ తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీల లో భాగంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చేత తెలంగాణ మలిదశ తొలి దశ ఉద్యమకారులకు పెన్షన్స్ సౌకర్యం 25000 మరియు 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వ ప్రశంసాపత్రాలు, రైలు , బస్సు పాసులు, మరియు ఆరోగ్య భీమా కల్పిస్తానని అట్టి హామీని నెరవేర్చాలని, ఉద్యమకారులు శాంతియుతంగా గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తుంటే తీవ్రవాదుల కంటే హీనంగా ఉద్యమకారులను అరెస్టు చేయడం ఎంతవరకు సబవని వారు అన్నారు.జూన్ రెండు లోపు ఉద్యమకారులకు ఇచ్చిన హామీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చకుంటే ఉద్యమకారుల ఉద్యమాన్ని తీవ్రతరం చేసి అక్కులను సాధించుకునే దిశగా ముందుకెళ్తామని




ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒకపక్క ఉద్యమకారులు ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలను పోషించుకోలేని స్థాయిలో తీవ్ర దుర్భర జీవితాలు అనుభవిస్తూ రోగాల బారినపడి అనేక మంది ఉద్యమకారులు మరణిస్తుంటే ప్రభుత్వానికి పట్టదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల పట్ల కాలయాపన చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఎంతకైనా తెగించి తీరుతామని వారు అన్నారు. జార్ఖండ్ తరహాలో ఉద్యమకారులను ఆదుకోవాల్సిన అవసరం రేవంత్ ప్రభుత్వం పై ఉందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓదెల రవి, కొత్తగట్టు ప్రభాకర్, యన్న మల్ల నర్సయ్య తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. వడ్ల తూకంపై రైతుల ఆవేదన






ఖానాపూర్ ఆర్సి మన దునియా ప్రతినిధి మే; 15.

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, దేవునిగూడ ఉపసర్పంచి కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, నాయకుడు సాయికుమార్‌తో పాటు పలువురు రైతులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు.కొనుగోలు కేంద్రంలో ప్రతి 40 కిలోల వడ్ల బస్తాకు 43 కిలోల వరకు తూకం వేస్తున్నారని, దీంతో ప్రతి క్వింటాల్‌కు 5 నుంచి 6 కిలోల వరకు నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొనుగోలు చేసిన వడ్లను వెంటనే గోదాములు, రైస్ మిల్లులకు తరలించాలని, హమాలీల సంఖ్యను పెంచాలని వారు డిమాండ్ చేశారు.దీనిపై స్పందించిన కలెక్టర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వడ్లలో తాలు, తప్పా ఉండడం వల్ల తరుగు వచ్చే అవకాశం ఉండటంతోనే ఒక్కో 40 కిలోల బస్తాకు అదనంగా ఒక కిలో తూకం వేస్తున్నట్లు ఆయన వివరించారు. వడ్ల బస్తాల తరలింపును వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల భద్రత మరియు పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పాఠశాల పరిసరాలను పరిశీలించిన అనంతరం, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, పెండింగ్ పనులను సమయానికి పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కాయ , ఎంపీడీవో ఉమర్ షరీఫ్ , ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ , మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ , వార్డు సభ్యులు మోసిన్ , పంచాయతీ కార్యదర్శి రాహుల్ , బిల్ కలెక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?

చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మే । శనివారం । 16 । 2026


# మార్ష్ విధ్వంసం.. చెన్నైని చిత్తుగా ఓడించిన లక్నో

**సీఎస్కేపై 7 వికెట్ల తేడాతో లక్నో ఘనవిజయం**

**38 బంతుల్లో 90 పరుగులతో విధ్వంసం సృష్టించిన మిచెల్ మార్ష్**

**మూడు వికెట్లతో చెన్నైని దెబ్బతీసిన ఆకాశ్ సింగ్**

**కార్తీక్ శర్మ (71) పోరాటం వృథా**

**ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం**

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్‌లో ఆకాశ్ సింగ్ (3/26) అదరగొట్టగా, బ్యాటింగ్‌లో మిచెల్ మార్ష్ (38 బంతుల్లో 90) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 188 పరుగుల భారీ లక్ష్యాన్ని లక్నో మరో 20 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. ఆకాశ్ సింగ్ తన అద్భుత బౌలింగ్‌తో గైక్వాడ్, శాంసన్, ఉర్విల్ పటేల్‌లను పెవిలియన్‌కు పంపి చెన్నై టాప్ ఆర్డర్‌ను కూల్చాడు. కష్టాల్లో పడిన జట్టును కార్తీక్ శర్మ (42 బంతుల్లో 71), డెవాల్డ్ బ్రెవిస్ (25) ఆదుకున్నారు. చివర్లో శివమ్ దూబే (16 బంతుల్లో 32 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో లక్నో ఆది నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ (32 బంతుల్లో 36) తొలి వికెట్‌కు 135 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అతడు.. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో చెన్నై బౌలర్లను ఉతికారేశాడు. సెంచరీకి కేవలం 10 పరుగుల దూరంలో దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు. మార్ష్ నిష్క్రమణ తర్వాత నికోలస్ పూరన్ (17 బంతుల్లో 32) తనదైన శైలిలో హిట్టింగ్ చేసి మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఓటమితో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. లక్నో సొంతగడ్డపై వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది.



# రాణించిన కార్తీక్ శర్మ, శివమ్ దూబే... సీఎస్కే ఈ స్కోరు కాపాడుకోగలదా?

**లక్నోతో మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మొదట బ్యాటింగ్**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 187 పరుగులు చేసిన సీఎస్కే**

**42 బంతుల్లో 71 పరుగులతో అదరగొట్టిన కార్తీక్ శర్మ**

**చివర్లో 16 బంతుల్లో 32 పరుగులు చేసిన శివమ్ దూబే**

**లక్నో బౌలర్లలో ఆకాశ్ సింగ్‌కు 3 వికెట్లు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోరు సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్కే, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. యువ బ్యాటర్ కార్తీక్ శర్మ (71) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, చివర్లో శివమ్ దూబే (32లి) దూకుడైన ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో లక్నో ముందు 188 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. లక్నోలోని ఏకనా స్టేడియంలో టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ ప్రారంభించిన చెన్నైకి ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. లక్నో బౌలర్ ఆకాశ్ సింగ్ తన అద్భుత బౌలింగ్‌తో చెన్నై టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (13), సంజూ శాంసన్ (20), ఉర్విల్ పటేల్ (6) వికెట్లను పడగొట్టి సీఎస్కేను కష్టాల్లోకి నెట్టాడు. ఈ దశలో కార్తీక్ శర్మ, డివాల్డ్ బ్రెవిస్ (25)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ముఖ్యంగా కార్తీక్ శర్మ అద్భుతంగా ఆడి కేవలం 42 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 71 పరుగులు చేశాడు. అతను ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే తనదైన శైలిలో రెచ్చిపోయాడు. కేవలం 16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో చెన్నై భారీ స్కోరు చేయగలిగింది. లక్నో బౌలర్లలో ఆకాశ్ సింగ్ 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా.. షమీ, షాబాజ్ అహ్మద్ చెరో వికెట్ తీసుకున్నారు.



# నిజామాబాద్ బీజేపీలో కలకలం.. కార్పొరేటర్? టికెట్? పేరిట డబ్బులు వసూలు..!

**పార్టీకి చెడ్డ పేరు చోటా నేతలు**

**బిజెపి పార్టీలో కలకలం**

**రాజకీయంగా చర్చకు దారి**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

బీజేపీలో ఓ ఘటన కలకలం రేపుతోంది. ఇటీవల జరిగిన నిజామాబాద్? మున్సిపల్? కార్పొరేషన్? ఎన్నికల్లో కొందరు చోటా నాయకులు టికెట్ల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టికెట్? ఇప్పిస్తామంటూ కొందరు నాయకులు డబ్బులు తీసుకుని మోసం చేసినట్లుగా తెలుస్తోంది. తాజాగా ఈ విషయమై ఓ మహిళ బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేయడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.

అసలేం జరిగిదంటే..

తనకు కార్పొరేటర్? టికెట్? ఇప్పిస్తానని బీజేపీ నేత తన వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితులు మిర్యాల్కర్? గీత పార్టీ నిజామాబాద్? జిల్లా అధ్యక్షుడు దినేష్?? కులాచారి కి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం.. కార్పొరేటర్? ఎన్నికల్లో 49వ డివిజన్? బీజేపీ టికెట్? ఇప్పిస్తానని బీజేపీ నాయకుడు బూసపు? శంకర్? ఓ మహిళను సంప్రదించాడు. అతడి మాటలను నమ్మిన సదరు మహిళ శంకర్?కు రూ. లక్ష ముట్టజెప్పింది. అంతేకాకుండా ప్రచారానికి కారు, ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, నమూనా బ్యాలెట్?కు డబ్బులు కావాలని చెప్పి అదనంగా మరిన్ని డబ్బులు వసూలు చేశాడు. అనంతరం నీకు టికెట్? కన్?ఫాం అయ్యింది అంటూ సదరు మహిళను నమ్మబలికాడు. ఇలా నామినేషన్? చివరి రోజు వరకు నమ్మించి కాలం గడిపాడు. చివరకు తనకు టికెట్? రాలేదని తెలిసి మోసపోయానని గ్రహించింది. అంతేకాకుండా ఇండిపెండెంట్?గా కూడా పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయింది.

డబ్బులు అడిగితే బెదిరింపులు

టికెట్? రాకపోవడంతో సదరు మహిళ బీజేపీ నాయకుడిని సంప్రదించింది. తనకు టికెట్? రానందున తన డబ్బులు తనకు వాపస్? ఇవ్వాలని కోరింది. అయినా స్పందించకపోవడంతో డబ్బుల కోసం నిలదీసింది. దీంతో సదరు నాయకుడు అసలు రూపం బయటపెట్టాడు. 'ఒక్క రూపాయి కూడా తిరిగి ఇవ్వను.. ఏం చేసుకుంటావో చేసుకో.. ఈ విషయం ఎవరైనా చెబితే నీ అంతు చూస్తా' అంటూ అతని తమ్ముడితో కలిసి బెదిరింపులకు దిగాడు. ఎక్కడ కనిపించినా తనను అసభ్యంగా దూషిస్తున్నాడని.. నా అంతుచూస్తానని బెదిరిస్తున్నాడని మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు ఎమ్మెల్యే ధన్?పాల్?కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది.

పార్టీకి చెడ్డపేరు తెస్తున్న చోటా నేతలు

నిజామాబాద్ జిల్లా బీజేపీలోని పెద్ద నాయకులు పార్టీని ప్రజల్లో తీసుకెళ్లేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పార్టీ నిజామాబాద్? ఎంపీ ధర్మపురి అర్వింద్? తో పాటు ఎమ్మెల్యేలు పార్టీ అభివృద్ధి కోసం శాయశక్తులా పనిచేస్తున్నారు. పార్టీపై ఎటువంటి మరక పడకుండా ముందుకు సాగుతున్నారు. అలాంటిది కొందరు చోటా నాయకులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కొందరు కార్పొరేటర్లు డబ్బులు వసూలు చేయడంతో పాటు ఇలా మరికొందరు టికెట్ల పేరిట దండుకోవడం.. పార్టీకి చెడ్డపేరు తెస్తోందని శ్రేణుల్లో చర్చ మొదలైంది.

బిజెపి టికెట్ ఎన్నికల సమయంలోనూ..

మున్సిపల్? ఎన్నికల సమయంలోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ సహాయం చేసినట్లు సమాచారం. పార్టీ ఫండ్? నుంచి అభ్యర్థుల ఖర్చుల కోసం కొంత మేర డబ్బులు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే ఇందూలోనూ కొందరు చోటామోటా నాయకులు తమ చేతివాటం ప్రదర్శినట్లు తాజాగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై కొందరు నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా.. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతం నుంచి గెలిపిన బీజేపీ కార్పొరేటర్? ఇటీవల ఒకరి నుంచి పెద్దమొత్తం డబ్బులు డిమాండ్? చేయడం.. ఇదేమిటని అడిగితే పార్టీ టికెట్? కోసం రూ.లక్షల ఖర్చు చేశామని బహిరంగ వ్యాఖ్యలు చేయడం కొసమెరుపు. అత్యంత క్రమశిక్షణ కలిగిన బీజేపీలో కొందరు చిన్నస్థాయి నాయకులు పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చేలా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# అభిమానులకు షాక్.. టిక్కెట్ ధరలను రెండింతలు పెంచిన సన్‌రైజర్స్

అభిమానులకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) షాకిచ్చింది. ఎస్ఆర్‌హెచ్ ఐపీఎల్ టిక్కెట్ల ధరలను భారీగా పెంచింది. ఈ నెల 22వ తేదీన ఉప్పల్ వేదికగా ఎస్ఆర్‌హెచ్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్ కోసం డిస్ట్రిక్ట్ యాప్‌లలో టిక్కెట్ల కోసం బుకింగ్ మొదలైంది. టిక్కెట్ల ధరలను రెండింతలకు పైగా పెంచడం గమనార్హం. రూ.950 టిక్కెట్ ధరను రూ.2 వేలకు, రూ.1,500 టిక్కెట్ ధరను రూ.3 వేలకు, రూ.1,910 టిక్కెట్ ధరను రూ.3,500కు, రూ.2,500 టిక్కెట్ ధరను రూ.4,500కు పెంచారు. అలాగే రూ.4,500 టిక్కెట్ ధరను రూ.6 వేలకు, రూ.7 వేల టిక్కెట్ ధరను రూ.10 వేలకు, రూ.23 వేల బాక్స్ టిక్కెట్ ధరను రూ.30 వేలకు, రూ.30 వేల కార్పొరేట్ బాక్స్ టిక్కెట్ ధరను రూ.45 వేలకు పెంచారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో సన్ రైజర్స్ మూడో స్థానంలో ఉంది. టోర్నీలో ఇప్పటివరకు 12 మ్యాచ్ లు ఆడిన ఎస్ఆర్ హెచ్ 7 విజయాలు నమోదు చేసింది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కు ధోనీ వస్తున్నాడా?

'పెద్ది' ట్రైలర్ లాంచ్‌కు ముఖ్య అతిథిగా ధోనీ హాజరయ్యే అవకాశం

ముంబైలో మే 18న జరగనున్న గ్రాండ్ ఈవెంట్

స్పోర్ట్స్ డ్రామా కావడంతో ధోనీని ఆహ్వానిస్తున్న చిత్రబృందం

బాలీవుడ్ స్టార్లకు బదులుగా క్రికెటర్‌తో వినూత్న ప్రచార వ్యూహం

దేశవ్యాప్తంగా 8 నగరాల్లో భారీ ప్రమోషన్లకు సన్నాహాలు





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' ప్రమోషన్ల విషయంలో చిత్రబృందం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతోంది. తెలుగు సినిమాలను హిందీలో ప్రమోట్ చేయడానికి సాధారణంగా బాలీవుడ్ స్టార్లను ఆహ్వానిస్తారు. కానీ, 'పెద్ది' మేకర్స్ ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టి, భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని రంగంలోకి దించుతున్నట్టు సమాచారం. ఈ నెల 18న ముంబైలో జరగనున్న 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ధోనీని ముఖ్య అతిథిగా తీసుకువచ్చేందుకు చర్చలు చివరి దశలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.గ్రామీణ నేపథ్యంలో నడిచే ఒక స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' మూవీ. అందుకే ఈ సినిమా స్ఫూర్తికి ధోనీయే సరైన వ్యక్తి అని, ఆయన హాజరైతే సినిమాకు దేశవ్యాప్తంగా భారీ మైలేజ్ వస్తుందని చిత్రబృందం భావిస్తోంది. ఈ సినిమాలో క్రికెట్, రెజ్లింగ్ వంటి క్రీడలకు ప్రాధాన్యం ఉంది. ఇప్పటికే టీజర్లలో ఈ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఒకవేళ అన్నీ అనుకున్నట్టు జరిగితే, ఒకే వేదికపై రామ్ చరణ్, ఎంఎస్ ధోనీ కనిపించడం ఇటు సినీ అభిమానులకు, అటు క్రికెట్ ప్రేమికులకు కనుల పండుగ అవుతుంది. ఇక, మూవీలోని ఈ పాత్ర కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా క్రికెట్, రెజ్లింగ్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. ఒక క్రీడాకారుడిగా చరణ్ నటిస్తున్న తొలి సినిమా కావడంతో ధోనీ రాక సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తుందని అంచనా వేస్తున్నారు.కేవలం ఈవెంట్‌కే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాలకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మే 18 నుంచి జూన్ 2 మధ్య ముంబై, భోపాల్, బెంగళూరు సహా మొత్తం 8 ప్రధాన నగరాల్లో ప్రమోషన్లు జరగనున్నాయి. ఈ ప్రమోషన్ల కోసం రామ్ చరణ్ విస్తృతంగా పర్యటించనున్నారు. త్వరలోనే ధోనీ రాకపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

## దర్శకుడిగా రామ్ పోతినేని.. బర్త్ డే రోజున ఫ్యాన్స్‌కు అదిరిపోయే సర్‌ప్రైజ్!

దర్శకుడిగా మారిన హీరో రామ్ పోతినేని

పుట్టినరోజున తన 23వ చిత్రంపై కీలక ప్రకటన

'రాపో సినిమాటిక్స్' పేరుతో కొత్త నిర్మాణ సంస్థ ప్రారంభం

సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ ను తెరకెక్కిస్తున్న రామ్

2026 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఒక ఊహించని కానుక ఇచ్చారు. నటుడిగా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన, ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన 23వ చిత్రం (=ూ్రూ23)తో మెగా ఫోన్ పట్టనున్నట్లు వెల్లడించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.ఈ చిత్రాన్ని ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఇందులోని 'వీర' అనే పవర్ ఫుల్ పాత్రలో రామ్ కనిపించనున్నారు. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ పోస్టర్‌ను బట్టి రామ్ ఒక ఇంటెన్స్ పాత్రతో రాబోతున్నారని అర్థమవుతోంది.ఈ సినిమా కోసం రామ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కుటుంబానికి చెందిన 'స్రవంతి మూవీస్' బ్యానర్ ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' (RAPO Cinematics) పేరుతో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.దర్శకుడిగా తన తొలి అడుగుపై రామ్ స్పందిస్తూ.. "ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు" అంటూ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. భారీ అంచనాల మధ్య రూపొందనున్న ఈ చిత్రం 2026 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.






## వయసుపై చర్చ.. టబు అసహనం

మన వయసుపై ఇతరులకే ఎక్కువ ఆందోళన ఉంటుందంటూ టబూ ఎద్దేవా

వయసు పెరగడం అనేది సహజ ప్రక్రియ అని వ్యాఖ్య

మహిళల వయసు గురించి మాట్లాడటం బాధాకరమన్న టబూ

సినీ రంగంలో నటీమణుల వయసుపై సమాజం, పరిశ్రమ చూపిస్తున్న అత్యుత్సాహంపై టబు ఘాటుగా స్పందించారు. "మన వయసు గురించి మనకంటే ఇతరులకే ఎక్కువ ఆందోళన ఉంటుంది" అని ఆమె ఎద్దేవా చేశారు. వయసు పెరగడం అనేది సహజమైన ప్రక్రియ అని, అది ఒక్క రోజులో జరిగేది కాదని ఆమె గుర్తు చేశారు. మహిళలు సాధిస్తున్న విజయాల కంటే వారి వయసు గురించి చర్చించడం బాధాకరమని, దీనివల్ల నటీమణులపై అనవసరమైన ఒత్తిడి పెరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలను తిరస్కరించే విషయంలో తాను అనుసరించే పద్ధతిని కూడా ఆమె వివరించారు. చాలా మంది డేట్స్ లేవని అబద్ధం చెప్పమని సలహా ఇచ్చినా, తాను మాత్రం స్క్రిప్ట్ నచ్చకపోతే ఆ విషయాన్ని ముఖం మీదనే చెప్పేస్తానని టబు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె తన తాజా చిత్రం 'భూత్ బంగ్లా' విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'స్లమ్ డాగ్' చిత్రంలో నటిస్తున్నారు. నాగార్జున 100వ చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించబోతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com